సాక్షి అనకాపల్లి

శుక్రవారం : 29 : మార్చి : 2024



ఏయూలో యూజీసీ అధికారి

విశాఖ: ఏయూను సందర్శించిన యూజీసీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ ఎం.గోపీచంద్‌ను వీసీ ప్రసాదరెడ్డి ఘనంగా సత్కరించారు.



మత్స్యకారులకు ప్రాధాన్యత

వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట అభ్యర్థి కంబాల జోగులు ఒడిశాలో మత్స్యకారులను కలిసి ప్రచారం చేశారు. IIలో

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (శుక్ర) 6.13 సహార్ (శని) 4.40
నర్సీపట్నం
6.17 4.38

న్యూస్‌రీల్

మాక్ కౌంటింగ్



మాక్ కౌంటింగ్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తుమ్మపాల: ఎస్పీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, జేసీ ఎం.జాహ్నవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో మాక్ కౌంటింగ్ డ్రిల్ నిర్వహించారు. కౌంటింగ్ ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులతో మాట్లాడారు. ఏ చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్డీవో చిన్నికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎన్నికల గ్రీవెన్స్ కమిటీ

తుమ్మపాల: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలననుసరించి కలెక్టరేట్‌లో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యయ నిర్ధారణ నోడల్ అధికారి, గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లతో సీజ్ చేసి, ఎఫ్ఐఆర్ నమోదు కాని, రాజకీయ పార్టీలకు చెందని నగదు, వస్తువులపై కమిటీ విచారణ చేస్తుందన్నారు. ప్రజలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని తమ అవసరాల నిమిత్తం మాత్రమే నగదు తీసుకెళ్లాలన్నారు. పట్టుబడిన సొమ్ము, వస్తువులపై తగిన ఆధారాలు చూపించి టీమ్‌లతో స్టేట్‌మెంట్ చేయించుకోవాలన్నారు. అనంతరం జిల్లా గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలని తెలియజేశారు. సహాయం కోసం 9290129847 నంబరును సంప్రదించాలన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి రాక నేడు

మహారాణిపేట: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ శుక్రవారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 1.50 గంటలకు వందేభారత్ రైలులో విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వెళతారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనం కోసం మధ్యాహ్నం 3.30 గంటలకు సింహాచలం బయలుదేరుతారు. దర్శన అనంతరం తిరిగి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ ఈ నెల 30న విశాఖ వస్తున్నారు. అన్నవరం నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 8.30 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. అనంతరం జిల్లా కోర్టులో జరిగే వర్క్‌షాపులో పాల్గొంటారు.

ఆర్టీసీ కండక్టర్ ఈశ్వరరావు సస్పెన్షన్

- ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు వేటు

దేవరాపల్లి: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన కాశీపురం గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ సూరెడ్డి ఈశ్వరరావును సస్పెండ్ చేసినట్లు గురువారం మాడుగుల నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి, దేవరాపల్లి మండల ఎన్నికల సహాయ అధికారి జి.లక్ష్మీనారాయణ తెలిపారు. కాశీపురంలోని జనసేన పార్టీ మండల కార్యాలయంలో ఈ నెల 19న జరిగిన జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ఎన్నికల ప్రచార సభలో పాల్గొని, ఈశ్వరరావు ప్రసంగించినట్లు పక్కా ఆధారాలతో స్థానికులు ఈ నెల 20న ఆర్వో, ఏఆర్వో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. లిఖితపూర్వక ఫిర్యాదుపై అధికారులు సమగ్ర విచారణ జరిపి మద్దిలపాలెం డిపో మేనేజర్‌కు నివేదించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు నిర్ధారణ కావడంతో కండక్టర్ ఈశ్వరరావును సస్పెండ్ చేస్తూ మద్దిలపాలెం డిపో మేనేజర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడికి బెయిల్ తిరస్కరణ

విశాఖ లీగల్: విశాఖ రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు ఎం.సుబ్రహ్మణ్యం గంగారావు బెయిల్ పిటిషన్‌ను జిల్లా ప్రధాన కోర్టు న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తిరస్కరించారు. గురువారం ప్రధాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు, గంగారావు న్యాయవాది వాదనలు విన్న న్యాయమూర్తి..కేసు దర్యాప్తు పూర్తి కానందున బెయిల్ మంజూరు చేయవద్దని ప్రాసిక్యూషన్ చెప్పిన వాదనతో ఏకీభవించారు. ఈ సమయంలో బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేశారు. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధి కొమ్మాదిలోని అపార్ట్‌మెంట్ వద్ద గత నెల రెండో తేదీ రాత్రి 10 గంటల సమయంలో రమణయ్యను హత్య చేసిన సంగతి తెలిసిందే..

ఓట్ ఫ్రం హోమ్



- 85 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం పైబడి వైకల్యమున్న పీడబ్ల్యూడీ ఓటర్లకు అవకాశం
- నియోజకవర్గ కేంద్రాల్లోనే ఫెసిలిటేషన్ సెంటర్లు
- జిల్లాలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు 4,352 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 21,150 మంది గుర్తింపు
- అర్హులైన ఓటర్లకు బీఎల్వోల ద్వారా ఇంటి వద్దే ఫారం-12డి అందజేత

జిల్లాలో 25,502మంది అర్హులు

జిల్లాలో 12,73,591 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 40 శాతం కన్నా ఎక్కువ అంగ వైకల్యం ఉన్న ఓటర్లు, 85 ఏళ్ల దాటిన వృద్ధులు కలిపి మొత్తం 25,502 మంది ఉన్నారు. వీరిలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు 4,352 మంది ఉంటే, 21,150 మంది దివ్యాంగ(పర్సన్ విత్ డిజబిలిటీ–పీడబ్ల్యూడీ) ఓటర్లు ఉన్నారు. వీరిలో దరఖాస్తు చేసిన వారందరికీ బ్యాలెట్లు జారీచేయాల్సి ఉంది.

సాక్షి, అనకాపల్లి: ప్రతి ఓటరూ తన ఓటు హక్కును వినియోగించేలా ఎన్నికల సంఘం అవసరమైన చర్యలు చేపడుతోంది. జిల్లాలో వేసవి ఎండలు ఇప్పటికే మండిపోతున్నాయి. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే పోలింగ్ జరిగే మే నెలలో ఎండల తీవ్రత మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో ఓటింగ్ శాతం తగ్గరాదన్న ముందుచూపుతో ఎన్నికల సంఘం 85 ఏళ్లు దాటిన వృద్ధులకు, 40 శాతానికి పైగా వైకల్యమున్న దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసేలా (ఓట్ ఫ్రమ్ హోం) వెసులుబాటు కల్పించింది. దీంతో ఓటింగ్ శాతం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో 2020లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఇంటి వద్ద నుంచి ఓటు వేసే పద్ధతిని అమలు చేశారు. ఆ తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ కండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్–1961లో సవరణలు తీసుకొచ్చింది. ఓట్ ఫ్రం హోం కార్యక్రమంలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు, 40 శాతం పైబడి వైకల్యం ఉన్న పీడబ్ల్యూడీ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ల ద్వారా ఓటు హక్కు కల్పించారు. వైకల్యం ఉన్న వారు నిర్ధారిత సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలి. వృద్ధులు, వికలాంగులు పోస్టల్ బ్యాలెట్లలో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి, దాన్ని కవరులో ఉంచి వారికి కేటాయించిన బ్యాలెట్ బాక్సులో పడేయాలి.

బీఎల్వోలదే బాధ్యత

అర్హులైన వారికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలు అందించి, వారితో ఓటు వేయించే బాధ్యత రిటర్నింగ్ అధికారి ఆదేశాలతో బీఎల్వోలే తీసుకుంటారు. నోటిఫికేషన్ విడుదలైన ఐదు రోజుల్లో వాటిని భర్తీ చేసి బీఎల్వోలకు సమర్పించాలి. బీఎల్వోలు వాటిని తీసుకెళ్లి సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందిస్తారు. పోలింగ్ కన్నా ముందే ఓట్ ఫ్రమ్ హోం ఓటింగ్ ఉంటుంది. జిల్లా ఎన్నికల అధికారి ఈ తేదీని నిర్ణయిస్తారు. అధికారులు పోస్టల్ బ్యాలెట్లను ఇళ్ల వద్దకే తెచ్చి అందిస్తారు. ఐదుగురు పోలింగ్ సిబ్బంది, వీడియో గ్రాఫర్, పోలీసు రక్షణతో బ్యాలెట్ బాక్సు తీసుకెళ్లి ఓటు వేయిస్తారు

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ పర్సనల్స్, ఇతర ఉద్యోగులతో పాటు ఓట్ ఫ్రమ్ హోంకు అర్హత ఉన్న వారు జిల్లాలో 54 వేల మంది ఓటర్లు ఉన్నట్లు అంచనా. వీరిలో 28,409 మంది పోస్టల్ బ్యాలెట్‌కు అర్హతున్న ఓటర్లు. ఇంతకు ముందు ఎన్నికల అధికారులు నిర్ణయించిన తేదీన అందరూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లకు వచ్చి పోస్టల్ బ్యాలెట్లు తీసుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకునేవారు. ఇందువల్ల సమయం, డబ్బు వృథా అవుతుందని, ఇప్పుడు కొత్తగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనే పోలింగ్ సిబ్బందికి ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీరు కాకుండా ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర అత్యవసర విధులు నిర్వర్తించే శాఖలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు అందిస్తారు.జైళ్లలో ఉండే రిమాండ్ ఖైదీలకూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు.

ఓటింగ్ శాతం పెంచేందుకే..



జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో పోలింగ్ శాతం పెంచే చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. 85 ఏళ్లు దాటిన వారు, 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు బ్యాలెట్ ఓటుకు అర్హులు. ఇందులో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేసేవారికి వీల్ చైర్లు తదితర ఏర్పాట్లు చేస్తాం. రాలేని వారి వివరాలన్నీ బీఎల్వోల దగ్గర ఉన్నాయి. ఓట్ ఫ్రం హోం వేసేందుకు బీఎల్వోలు ఏప్రిల్ 22 లోపు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందిస్తారు. ఆర్వో స్థాయిలో హోం ఓటుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తారు. పోలింగ్ రోజుకు ముందే అర్హులైన వారి ఇంటికి వెళ్లి, వారితో ఓటు వేయిస్తారు.

– డాక్టర్ హేమంత్, నోడల్ అధికారి, యాక్సెసబుల్ ఎన్నికల విభాగం

వివాదాలకు దూరం

- ఒప్పంద పత్రాలు ఇచ్చిన ఇరు వర్గాలు
- గావు పండగలో ఘర్షణ పడ్డ వారి మధ్య సామరస్యం



వివాదాలకు దూరంగా ఉంటామని ఒప్పంద పత్రాలిస్తున్న స్థానికులు

గొలుగొండ: జాతర సందర్భంగా గొడవ పడ్డ రెండు వర్గాలు పోలీసుల జోక్యంతో వివాదాలకు దూరంగా ఉంటామని ఒప్పంద పత్రాలిచ్చారు. 11మందితో శాంతి కమిటీ వేయడంతో సమస్య సామరస్యంగా పరిష్కారమైంది. మండలంలోని ఎర్రవరం గ్రామంలో నాలుగు సంవత్సరాలకు ఒకసారి గావు పండగ నిర్వహిస్తారు. ఈ ఏడాది పండగ నిర్వహించిన సందర్భంగా రెండు వర్గాల మధ్య బుధవారం మధ్యాహ్నం చిన్నపాటి ఘర్షణ జరిగింది. దీంతో వారు గొలుగొండ పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. గురువారం అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, రూరల్ సీఐ హరి, ఎస్ఐ కృష్ణారావు గ్రామానికి వెళ్లి రెండు గ్రామాల వారితో మాట్లాడారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం కలిగి ఉన్నపుడే ప్రజలు ఆనందంగా ఉంటారని డీఎస్పీ నచ్చచెప్పారు. ప్రజలు స్నేహభావంతో ఉండాలని, చిన్న చిన్న వివాదాలకు ఉద్రేకానికి గురికావద్దన్నారు. శాంతి కమిటీ ఏర్పాటు చేశామని, ఈ కమిటీ సమక్షంలో వివాదాలను పరిష్కరించుకోవాలని, లేని పక్షంలో పోలీసులకు ఆశ్రయించాలన్నారు. యువత ఐక్యతగా ఉండాలని, వివాదాలకు పోతే జీవితాలు నాశనమవుతాయన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో సచివాలయ ఉద్యోగి

- యలమంచిలి మున్సిపాలిటీలో కొలువు
- స్వగ్రామం రేవుపోలవరంలో ప్రచారం



ఒడిశా రాష్ట్రం పూరీలో అనిత వెనుక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అడవిరాజు

యలమంచిలి రూరల్: ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఒక వెల్ఫేర్ అసిస్టెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం గ్రామానికి చెందిన వాసుపల్లి అడవిరాజు యలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని ఏఎస్నార్‌కాలనీ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. గతంలో 8 నెలలు డ్యూటీకి సెలవు పెట్టాడు. ఆ తర్వాత 10 రోజులు విధుల్లో చేరి మళ్లీ సెలవు పెట్టాడు. ప్రస్తుతం ఎటువంటి అధికారిక సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పచ్చపార్టీకి అనుకూలంగా రాజకీయ ప్రచారం చేస్తున్నాడు. ఇటీవల రేవుపోలవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే అనిత ఆవిష్కరించిన కార్యక్రమంలో అడవిరాజు పాల్గొన్నాడు. అనిత ఎన్నికల ప్రచారంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పాల్గొన్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ గ్రామానికి చెందిన పలువురు సచివాలయ ఉద్యోగి అడవిరాజు ఎన్నికల ప్రచారం చేయడంపై రాష్ట్ర పురపాలక కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

క్రిమినల్ కేసు ఉండగానే ఉద్యోగం

అడవిరాజుపై గతంలో క్రిమినల్ కేసు నమోదైంది. ఈ కేసు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఈలోగా సచివాలయ ఉద్యోగిగా పరీక్ష రాసి అర్హత సాధించాడు. ప్రస్తుతం ప్రొబేషన్ పీరియడ్ పూర్తయినప్పటికీ అడవిరాజుపై క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్నందున, సచివాలయ ఉద్యోగం ఇంకా పర్మినెంట్ కాలేదు. ఇదిలావుండగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ వెల్ఫేర్ అసిస్టెంట్ అడవిరాజు పచ్చపార్టీ కండువాలు కప్పుకుని ప్రచారంలో పాల్గొంటున్నాడు. తాజాగా బుధవారం కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత ఒడిశా, పూరి ఎన్నికల ప్రచారానికి వెళితే అక్కడికి కూడా అడవిరాజు వెళ్లాడు. అతని వైఖరిపై ఇప్పటికే పలువురు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

యలమంచిలి మున్సిపల్ కమిషనర్ కొండలరావు వద్ద ఈ విషయమై ప్రస్తావించగా, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నట్టు తేలితే వెంటనే ఉద్యోగం నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

కలెక్టర్, ఎస్పీ సుడిగాలి పర్యటన

- నర్సీపట్నం, గొలుగొండలో పోలింగ్ కేంద్రాలు, చెక్‌పోస్టుల తనిఖీ



నర్సీపట్నం మండలం గబ్బాడ పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ



గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో చెక్‌పోస్టును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

నర్సీపట్నం/గొలుగొండ: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రవి పట్టన్‌శెట్టి ఎస్పీ మురళీకృష్ణతో కలిసి గురువారం నర్సీపట్నం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. పోలింగ్ కేంద్రాలను, చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలిచ్చారు. ముందుగా నర్సీపట్నం మండలం గబ్బాడ ప్రాథమిక పాఠశాలలో 182, 183 పోలింగ్ కేంద్రాలను, అనంతరం ఎర్రన్నపాలెం చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం గొలుగొండ మండలం జోగంపేటలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ను తనిఖీ చేశారు. ఆపై కృష్ణదేవిపేటలో చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అల్లూరి, అనకాపల్లి జిల్లా సరిహద్దు కావడంతో ఇక్కడ చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడ పోలింగ్ కేంద్రాలతోపాటు ఏఎల్‌పురంలో పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా నగదు, మద్యంతోపాటు ఎన్నికల తాయిలాలకు సంబంధించి ఎటువంటి వస్తువులు రవాణా చేసినా కేసు నమోదు చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన **వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కింద స్థాయి** సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం, కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మాదక ద్రవ్యాల సరఫరాపై చర్యలు: కలెక్టర్

తుమ్మపాల: మద్యం, మాదక ద్రవ్యాల సరఫరాపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. గురువారం తాడేపల్లి నుంచి ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ **పాల్గొన్నారు. జిల్లాలో** గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను పూర్తిగా అరికట్టేందుకు తాటిపర్తి, ఏఎల్ పురం, కోనాం, గొలుగొండ ప్రాంతాల వద్ద నాలుగు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పోలీసు ఎక్సైజ్ శాఖల అధికారుల నిరంతర నిఘా ఉంటుందన్నారు. పోలీసు సూపరింటెండెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల ఉత్పత్తి, నివారణకు పోలీసు ఎక్సైజ్ శాఖల అధికారులు ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు, నడక మార్గాల్లోనూ నిఘా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మనసున్న మారాజు

- టీడీపీ హయాంలో మునిగిన, కాలిన బోట్లకు సాయం
- ఇలాంటి 36 బోట్లకు రూ.1.35 కోట్ల పరిహారం
- ఈనెల 16న నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఈసీ నుంచి అనుమతి రాగానే పంపిణీకి సన్నద్ధం
- సీఎం జగన్ రుణం తీర్చుకుంటామంటున్న మత్స్యకారులు





తుపానుకు ఫిషింగ్ హార్బర్‌లో మునిగిపోయిన బోటు

సాక్షి, విశాఖపట్నం, అచ్యుతాపురం:

మత్స్యకారులపై మమకారంతో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి పట్ల మరోసారి ఉదారతను చాటుకున్నారు. ఇప్పటికే మత్స్యకారుల సంక్షేమానికి పలు పథకాలు ప్రవేశ పెట్టి వారికి అండగా నిలిచారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల భృతి, లీటర్‌పై రూ.9 డీజిల్ సబ్సిడీ, 50 ఏళ్లకే పెన్షను, వేట సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల పరిహారం వంటి పలు ప్రయోజనాలను చేకూరుస్తున్నారు. వారికి ఏ కష్టం వచ్చినా వెంటనే ఆదుకుంటున్నారు.

గత నవంబర్ 19 అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 49 బోట్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. బాధిత బోటు యజమానులకు మూడు రోజుల్లోనే భారీ మొత్తంలో రూ.7.11 కోట్ల పరిహారాన్ని అందజేశారు. ఈ బోట్లపై ఆధారపడ్డ కలాసీలు 400 మంది జీవనోపాధి కోసం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఊహించిన దానికంటే ఎక్కువ పరిహారాన్ని అందించడంపై బాధిత మత్స్యకారులు ఎంతగానో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తమకు ఈ మేళ్లన్నీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే జరుగుతున్నాయన్న ఆనందంలో ఉన్నారు.

దెబ్బతిన్న బోట్లు

2014–2019 మధ్య కాలంలో మొత్తం 36 బోట్లు దెబ్బతిన్నాయి. వీటిలో 21 బోట్లు సముద్రంలో మునిగిపోగా, నాలుగు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఐదు నీటి అడుగున చిక్కుకుపోయాయి. మరో ఆరు బోట్లు ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదాల పాలై పాక్షికంగా నష్టం వాటిల్లింది. ఇందులో 2014 హుద్‌హుద్ తుపానుకు మునిగిపోయిన రెండు బోట్లకు, 2018 తిత్లీ తుపానులో మునిగిన మూడు బోట్లకు, 2019 పెథాయ్, జావద్ తుపాన్లకు మునిగిపోయిన 11 బోట్లకు టీడీపీ ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. అప్పుడెప్పుడో టీడీపీ హయాంలో దెబ్బతిన్న బోట్లకు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాయమందిస్తుండడంపై మనసున్న మారాజు అంటూ సీఎం జగన్‌ను మత్స్యకారులు కొనియాడుతున్నారు. ఆయన రుణం తీర్చుకుంటామని పేర్కొంటున్నారు.

మత్స్యకారులపై మమకారం

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో సముద్రంలో మత్స్యకారుల బోట్లు కాలిపోయినా, మునిగిపోయినా, తుపాన్లలో దెబ్బతిన్నా పరిహారం సక్రమంగా ఇచ్చేవారు కాదు. ఇచ్చే అరకొర సాయం కూడా ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందుకు భిన్నంగా మత్స్యకారులపై అభిమానాన్ని చాటుకుంటున్నారు. వారికొచ్చే కష్టాలపై తక్షణమే స్పందించి ఉదారంగా సాయమందిస్తున్నారు. టీడీపీ హయాంలో మునిగిన, అగ్ని ప్రమాదానికి గురైన, తుపాన్లలో దెబ్బతిన్న బోట్లకు కూడా పరిహారం అందించేలా చూడాలని బాధిత మత్స్యకారులు తాజా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కోరారు. దీనిపై ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం బాధిత మత్స్యకారులకు పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వివిధ ప్రమాద ఘటనల్లో దెబ్బతిన్న 36 బోట్లకు రూ.1.35 కోట్ల నిధులు విడుదల చేస్తూ మత్స్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ నిధులు జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో జమయ్యాయి.

చంద్రబాబు హయాంలో పస్తులే



వేటకెళితేనే కడుపు నిండేది. లేకుంటే పస్తులే. చంద్రబాబు హయాంలో మత్స్యకార భృతి ఎప్పుడో ఇచ్చేవారు. అది కూడా రూ.4 వేలు. వేట నిషేధ సమయంలో అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సివచ్చేది. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మత్స్యకార భరోసా కింద రూ.10 వేల పరిహారం నిషేధ కాలంలోనే ఇవ్వడంతో కుటుంబ పోషణకు ఎంతో ఉపయోగపడుతోంది. నాకు ఒక బోటు ఉండడంతో సబ్సిడీపై డీజిల్ అందిస్తున్నారు. ఇది నాకు ఎంతో ఆర్థిక ఉపశమనం కలిగిస్తోంది.

–చోడుపల్లి సింహాచలం, తంతడి గ్రామం, అచ్యుతాపురం మండలం

జగనన్న ప్రభుత్వం ఆదుకుంది



చేపల వేటే నాకు జీవనాధారం. నేను భార్య, ముగ్గురు పిల్లల్ని పోషించాలి. చేపల్ని పట్టి అమ్ముకుంటే వచ్చే సొమ్ము జీవనానికే సరిపోతుంది. వేట నిషేధ సమయంలో అక్కరకొస్తుందని ఆదా చేద్దామనుకుంటే ఎప్పుడూ వీలయ్యేది కాదు. జగనన్న ప్రభుత్వం వేట నిషేధ సమయంలో రూ.10 వేల మత్స్యకార భరోసా అందిస్తోంది. దాంతో నా కుటుంబాన్ని ఎలాంటి కష్టం లేకుండా పోషించగలుగుతున్నాను. డీజిల్ కొనుగోలుకు సబ్సిడీ ఇవ్వడంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను.

–గనగళ్ల దేముడు, పూడిమడక గ్రామం, అచ్యుతాపురం మండలం

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



నూకాంబిక అమ్మవారి జాతర గోడపత్రికలను ఆవిష్కరించిన ఈవో బండారు ప్రసాద్

అనకాపల్లి: ఈ ఏడాది గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. అమ్మవారి బాలాలయంలో కొత్త అమావాస్య జాతర గోడ పత్రికలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఏప్రిల్ 7న అమ్మవారి జాతర, 8న కొత్త అమావాస్య అమ్మవారి పండుగను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రూ.10.13 కోట్లకు అప్పన్న తలనీలాల వేలం

సింహాచలం: సింహాచలం దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాలకు గురువారం వేలం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి గాను రూ.10 కోట్ల 13 లక్షల ఆదాయం లభించింది. తమిళనాడుకు చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్ హెచ్చుమొత్తానికి వేలం సొంతం చేసుకుంది. సీల్డ్ టెండర్లు 8 మంది దాఖలు చేయగా అందులో కూడా దొరై ఎంటర్‌ప్రైజస్ 9కోట్ల 61లక్షల 40వేల హెచ్చుమొత్తానికి కోడ్ చేసింది. అలాగే ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా గరుడ ఎంటర్‌ప్రైజస్ 8కోట్ల 28లక్షల 99వేల 999 కోడ్ చేసింది. బహిరంగ వేలం ద్వారా వచ్చిన రూ.10 కోట్ల 13లక్షలు హెచ్చుపాటని ఖరారు చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఏఈవో పాలూరి నరసింగరావు, ఏఈ రాంబాబు, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి తదితరులు వేలం నిర్వహించారు.

క్లుప్తంగా

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 12 మద్యం(క్వార్టర్) బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ శంకరరావు తెలిపారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆదినారాయణను పట్టుకున్నారు. ఆయన నుంచి బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విస్తృతంగా కూంబింగ్

వై.రామవరం: జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాపోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. దీనిలో భాగంగా కూంబింగ్‌ను విస్తృతం చేసింది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాలు తనిఖీలు నిర్వహించాయి. మండల కేంద్రం నుంచి లోతట్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన మార్గంలో వాహనాలు క్షుణ్ణంగా పరిశీలించాయి.

సంక్షేమం నిలవాలంటే.. వైఎస్సార్‌సీపీ గెలవాలి


కూండ్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


చోడవరంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ


మాకవరపాలెం: మల్లవరంలో ఓ ఇంటి వద్ద ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌కు హారతిస్తున్న మహిళ

- అభివృద్ధి, సంక్షేమమే అస్త్రాలుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు దూసుకెళ్తున్నారు. మండుటెండల్లో కూడా హుషారుగా ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరిస్తూ, ప్రజలను ఓట్లు అడుతున్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు.

- అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండుటెండల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలంటూ అభ్యర్థించారు. 84వ వార్డు కోట్నివీధి, గొల్లవీధి, నాయీబ్రాహ్మణవీధి, కూండ్రం ప్రాంతాల్లో గడప గడపకూ వెళ్లి ఓటర్లను కలిసి, అభివృద్ధి, సంక్షేమ ప్రదాత జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు.
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారానికి పట్టణ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పెద్ద ఎత్తున అభిమానులు, మహిళలు మద్దతు పలుకుతుండటంతో పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది. నాలుగో రోజు గురువారం చోడవరం పట్టణం వెలమవీధి, లక్ష్మీదేవిపేట, రామకోవెల వీధి ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.
- మాకవరపాలెం మండలం మల్లవరంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ నేత మిడతాన తాతాజీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

'అనకాపల్లి ఎంపీగా బూడి గెలుపు తథ్యం'


ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు


బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న నర్సీపట్నం సీనియర్ నాయకుడు బోళెం నర్సింహమూర్తి తదితరులు

- ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడుకు శుభాకాంక్షల వెల్లువ
- డిప్యూటీ సీఎం బూడిని కలిసిన పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

దేవరాపల్లి: అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన అనుచరులతో కలిసి తారువలో ముత్యాలనాయుడిని కలిశారు. శాలువా వేసి, పుష్ప గుచ్ఛం అందించి అభినందన సత్కారం చేశారు. సామాన్యుడికి, సంపన్నుడికి మధ్య జరుగుతున్న పోరులో ప్రజా సమస్యల పట్ల పరిపూర్ణ అవగాహన ఉన్న బూడి ముత్యాలనాయుడు అనకాపల్లి ఎంపీగా భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని అదీప్‌రాజ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు బూడిని కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎంపీ అభ్యర్థి బూడిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైలపూడి భగవాన్ జయరాం, పార్టీ నాయకుడు గండి రవికుమార్, పెందుర్తి, పరవాడ జెడ్పీటీసీలు యుప్పిలి కనకరాజు, పీఎస్ రాజు, పరవాడ, సబ్బవరం ఎంపీపీలు పైలా శ్రీనివాసరావు, బోకం రామునాయుడు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, కార్పొరేటర్ ముమ్మన దేముడు, సబ్బవరం మాజీ జెడ్పీటీసీ కోటాన రాము, పెందుర్తి, సబ్బవరం మండలాల పార్టీ అధ్యక్షులు గొరపల్లి శ్రీను, కర్రి బాబు, సబ్బవరం మండల యూత్ అధ్యక్షుడు ఎడ్ల నాయుడు, పెందుర్తి వార్డు అధ్యక్షులు మెంటి మహేష్, గండ్రెడ్డి మహలక్ష్మినాయుడు, నర్సీపట్నం నియోజకవర్గం వేములపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోళెం నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే మత్స్యకారులకు ప్రాధాన్యత


పూరీలో మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న కంబాల జోగులు


సమావేశానికి హాజరైన వలస మత్స్యకారులు

- మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులిచ్చిన ఘనత జగన్‌దే
- వచ్చే ఎన్నికల్లో మీ మద్దతు చారిత్రక అవసరం
- వలస మత్స్యకారులతో సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి: మత్స్యకారులను గుర్తించి వారికి పదవులు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం స్థానిక సీనియర్ నాయకులతో కలిసి ఒరిస్సాలోని పూరీ, పారాదీప్‌లకు తాత్కాలిక వలస వెళ్లిన మత్స్యకార కుటుంబాలను అక్కడే కలిశారు. ముందుగా ఎమ్మెల్యే అభ్యర్థిగా జోగులును జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎస్.రాయవరం వైస్ఎంపీపీ బొలిశెట్టి గోవిందు, నక్కపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మలు స్థానిక మత్స్యకారులకు పరిచయం చేశారు.

వారినుద్దేశించి కంబాల జోగులు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో మత్స్యకారులను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుని రాజ్యాంగ పదవుల్లో మొండి చేయి చూపించారన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక మత్స్యకారులైన మోపిదేవి వెంకటరమణకు మంత్రి పదవితోపాటు, రాజ్యసభ పదవి, సీదిరి అప్పలరాజును ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు. విశాఖ జిల్లాకు చెందిన కోలా గురువులకు జిల్లా పార్టీ అధ్యక్ష పదవితోపాటు, కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమించారని పేర్కొన్నారు. నక్కపల్లి జెడ్పీటీసీగా గోసల కాసులమ్మకు ఇచ్చారన్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం జగన్ ప్రభుత్వం చేసిన వేటనిషేధ భృతి రూ.10 వేలకు పెంపు, డీజిల్ సబ్సిడీ పెంపు లబ్ధిని వివరించారు. మత్స్యకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, మార్కెటింగ్ సదుపాయం పెంచేందుకు జగన్ ప్రభుత్వం పోర్టులు, హార్బర్లు నిర్మిస్తోందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లు, మినీ జెట్టీల నిర్మాణ ప్రగతిని వివరించారు. రాజయ్యపేటలో ఫిష్‌ల్యాండింగ్ సెంటరు, మినీజెట్టీ పూర్తయితే మత్స్యకారులకు స్థానికంగానే ఉపాధి లభిస్తుందన్నారు. వచ్చేనెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మత్స్యకారుల మద్దతు చారిత్రక అవసరమన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొని, ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబూరావు, కొణతాల శ్రీనివాసరావు, కోడ కోటేశ్వరరావు, కంబాల సందీప్, యజ్జల అన్నవరం, ఆప్కాఫ్ వైస్ చైర్మన్, జిల్లా మత్స్యకార సంఘ నాయకుడు మాతా గురునాథరావు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన వేదమంత్రాలు

- పులకరించిన సింహగిరి
- శాస్త్రోక్తంగా రెండవ రోజు సుదర్శన నారసింహ మహా యజ్ఞం
- పాల్గొన్న దేవదాయశాఖ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్


యజ్ఞాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం రెండవ రోజు గురువారం వైభవంగా కొనసాగింది. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం కూడా కలసి రావడంతో యజ్ఞంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. వేదమంత్రాలతో సింహగిరి పులకరించింది. ఉదయం స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఓ పల్లకీలో, చక్రపెరుమాళ్‌ను ఓ పల్లకీలో అధిష్టింపజేసి ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న యజ్ఞశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ను ఓ వేదికపై, మరొక వేదికపై స్వామి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. వేద మంత్రోచ్ఛరణలు పఠిస్తూ యజ్ఞాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులకు అందజేశారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రబంధం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకాలను వైదికులు పారాయణం చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు దేవస్థానం తరఫున శాలువా, రవిక, కల్యాణం లడ్డూ, పులిహోర ప్రసాదం, అప్పన్న స్వామి రాగి ప్రతిమ అందజేశారు. ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పించారు. యజ్ఞం తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మహాయజ్ఞంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. దేవస్థానం తరఫున ఈవో వారికి స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నీలగిరి, జీడిమామిడి తోటలు దగ్ధం


అగ్ని ప్రమాదంలో కాలిన నీలగిరి మొక్కలు

చీడికాడ: మండలంలోని అడివి అగ్రహారం సమీపంలో గురువారం మధ్యాహ్నం కార్చిచ్చు ధాటికి సుమారు 10 ఎకరాల్లో నీలగిరి, జీడిమామిడి తోటలు దగ్ధం అయ్యాయి. రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంఘటనపై చోడవరం అగ్నిమాపక కేంద్రం సీఐ బీవీఆర్ స్వామి మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో అగ్ని ప్రమాదంపై తమకు సమాచారం అందిందన్నారు. తాము వెళ్లేసరికే మంటలు భారీగా చెలరేగాయని, మరింతగా విస్తరించకుండా మంటల్ని అదుపు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తోటలు విశాఖకు చెందిన వారివిగా తెలిపారు.

ఐఐఎం విశాఖలో సీఆర్‌ఎంఈ ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ప్రాంగణంలో సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఏకం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అమిత్ చటర్జీ, ఆచార్య బి.చక్రవర్తి, విర్చాద్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డి.శ్రీ ప్రసాద్, ఐఐఎం సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏకం ఫౌండేషన్ ట్రస్టీ అమిత్ చటర్జీ మాట్లాడుతూ బాధ్యత కలిగిన మేనేజర్లను తయారు చేస్తే మంచి నాయకులుగా నిలుస్తారన్నారు. విర్చాద్ ఎండీ శ్రీ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలకు ఉపయుక్తంగా నిలిచే సూచనలు అందిస్తూ వారికి తోడ్పాటును అందించే విధంగా కేంద్రం నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆచార్య చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణం, సామాజిక, పరిపాలన నిర్ణయాలను మేనేజ్‌మెంట్ విద్యలో భాగం చేస్తుందన్నారు. కేంద్రం అధిపతి ఆచార్య అమిత్ చక్రవర్తి తదితరులు ప్రసంగించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు, గుల్లిపాడు రైల్వే స్టేషన్ మధ్య గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందినట్లు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్‌మారూఫ్ గురువారం తెలిపారు. విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళ్లే రైలు నుంచి మధ్యాహ్నం జారిపడినట్టు పేర్కొన్నారు. మృతుడు సుమారు 45 సంవత్సరాల వయసు కలిగి, తెలుపు రంగు చొక్కా, పుల్‌ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని తుని రైల్వే ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఏయూ అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణలు

- యూనివర్సిటీలో చదువుకునేది పేద, మధ్య తరగతి విద్యార్థులే..
- వీరి కోసం క్రీడా మైదానాలు అభివృద్ధి చేయడం తప్పా?
- విద్యార్థుల ప్రయోజనాలకు రాజకీయాలు ముడిపెట్టడం సరికాదు
- ఏయూ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్

విశాఖ సిటీ: పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తూ.. జాతీయ స్థాయిలో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా నిలిచిన ఆంధ్రా యూనివర్సిటీ అభివృద్ధిని చూసి ఓర్వ లేకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఏయూ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏయూ ప్రతిష్టకు భంగం కలిగించేలా జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ మీడియా సమావేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. నగరానికి చెందిన ఒక ప్రముఖ ప్రైవేట్ విద్యా సంస్థకు వత్తాసు పలుకుతూ, ప్రభుత్వ విద్యా సంస్థ ఏయూను టార్గెట్ చేయడం సమంజసం కాదని హితవుపలికారు. ఏయూ అభివృద్ధి, ప్రగతిని చూసి ఓర్వలేక.. ప్రైవేటు విద్యాసంస్థ యజమాని వెనుక ఉండి నడిపిస్తున్నారనే సందేహం కలుగుతోందన్నారు. గతంలో ఈ ప్రైవేటు విశ్వవిద్యాలయానికి చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి ఏయూని దెయ్యాల కొంపగా వాఖ్యానించడాన్ని ఇంకా మరువలేదన్నారు. ప్రస్తుతం ఎంపీగా పోటీలో ఉన్న ఆయన మనవడు.. ఆంధ్రా యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే విధంగా మూర్తి యాదవ్‌తో ఆరోపణలు చేయిస్తున్నారని బలంగా నమ్ముతున్నామని చెప్పారు.

విద్యార్థుల కోసం క్రీడా మైదానం అభివృద్ధి చేస్తుంటే..

యూనివర్సిటీ విద్యార్థులకు క్రీడలకు ఉపయుక్తంగా ఇంజనీరింగ్ కాలేజీ మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఈ స్థలాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేసి క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ఇందుకోసం అవసరమైన మట్టిని వేయడంతో పాటు మైదానం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని వెల్లడించారు. ఈ నిర్మాణాలకు అవసరమైన మట్టి, రాయి వంటివి పలువురు దాతలు స్వచ్ఛందంగా ఉచితంగా ఏయుకు అందిస్తున్నారని వివరించారు. ఏయూపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా దాతల సహకారంతో విద్యార్థుల కోసం క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తుంటే.. కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తప్పుబడుతూ ప్రైవేటు యూనివర్సిటీ యజమానిని ఎంపీగా గెలిపించడానికి రాజకీయ కోణంలో ఆరోపణలు చేయడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధిపై విద్యార్థులు, తల్లిదండ్రులు, నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తుంటే.. కార్పొరేటర్ ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు కొమ్ము కాసే విధంగా వాఖ్యలు చేసున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా మూర్తి యాదవ్ తన వైఖరిని మార్చుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా వీక్షించి తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇదే విధమైన అసత్య, దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే విశ్వవిద్యాలయ ఉద్యోగులు, విద్యార్థులు దీనిపై తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కేబీ రోడ్డులో తప్పిన ప్రమాదం

- ట్రాలర్ లారీ నుంచి రోడ్డుపై పడ్డ భారీ గ్రానైట్ రాయి
- వైఎస్సార్‌సీపీ రోడ్లు వేస్తుంటే టీడీపీ నాయకుల గ్రానైట్ లారీలు ధ్వంసం చేస్తున్నాయని ప్రజల ఆగ్రహం


హెవీ లోడుతో వెళ్తున్న ట్రాలర్ లారీ


గ్రానైట్ రాయి పడి దెబ్బతిన్న రోడ్డు

బుచ్చెయ్యపేట : మండలంలోని కశింకోట-బంగారుమెట్ట(కేబీ) రోడ్డులో పెద్ద ప్రమాదం తప్పింది. టన్నుల బరువున్న గ్రానైట్ రాయిని తరలిస్తున్న ట్రాలీ నుండి ఒక రాయి రోడ్డుపై పడింది. ఆ సమయంతో వాహనాలు, ప్రజలు ఎవరూ పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు 20 టన్నులు బరువున్న రాయి వాహనాలపై పడి ఉంటే ప్రమాదం ఊహకందని పరిస్థితి. గురువారం తెల్లవారు జామున బంగారుమెట్ట జంక్షన్ మీదుగా అనకాపల్లి హైవేపై ట్రాలర్ లారీపై 60 టన్నులకు పైగా బరువున్న మూడు గ్రానైట్ దిమ్మలను తరలిస్తున్నారు. బుచ్చెయ్యపేట దాటిన తరవాత రాజాం ధర్మకాటా మళ్లింపు వద్ద ట్రాలీ మీద నుంచి వీటిలో ఓ గ్రానైట్ రాయి రోడ్డుపై పడింది. సుమారు 20 టన్నుల బరువున్న రాయి రోడ్డుపై పడటంతో ఇటీవల రూ.32 కోట్లతో వేసిన తారు రోడ్డు దెబ్బతింది. నిత్యం ఈ రోడ్డులో జిల్లా కేంద్రం అనకాపల్లికి బుచ్చెయ్యపేట, మాడుగుల, రావికమతం తదితర మండలాల నుంచి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీగా ఉండే ఈ రహదారిలో టన్నుల బరువున్న గ్రానైట్‌ను నిర్లక్ష్యంగా తరలిస్తుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ అభ్యర్థి రాజుదేనా?

రోడ్లు దెబ్బతినడంపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పటికే పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. చోడవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుకు గ్రానైట్ క్వారీలున్నాయి. ఇతనికి చెందిన గ్రానైట్ లారీలు 5 నుంచి 10 టన్నుల సామర్థ్యమున్న చిన్న గ్రామాల రోడ్లపై వందల టన్నుల బరువుతో వెళ్తున్నాయి. దీంతో తారు రోడ్లు బీటలు వారి, గోతులు పడుతున్నాయి. తాజా సంఘటనకు కారణమైన గ్రానైట్ లోడ్ లారీ కూడా టీడీపీ అభ్యర్థికి చెందిందేనని స్థానికులు చెప్తున్నారు. ఇటీవల ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కేబీ రోడ్డును రూ.32 కోట్లతో పునరుద్ధరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్లు వేస్తుంటే, టీడీపీ నాయకుల గ్రానైట్ లారీలు నిర్లక్ష్యంగా నడిపి వాటిని పాడు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక

గంగవరం: పంద్రప్రోలు పంచాయతీ పోతందొరపాలెం గ్రామానికి చెందిన 40 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం సాయంత్రం మండలంలో మోహనాపురం, పంద్రప్రోలు, మర్రిపాలెం, జడేరు పంచాయతీల్లో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) ఎన్నికల ప్రచారంలో వారంతా కలిసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తాము రామన్నదొర, శారపు బాపూజీ, ఎస్.రాజబాబుల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు తాటి పండుదొర, తాము లక్ష్మి నాయకత్వంలో చేరిన వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బాలికపై మేనమామ అత్యాచార యత్నం

నర్సీపట్నం: మైనర్ బాలికపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ హరి తెలిపారు. నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినిపై వరుసకు మేనమామయ్యే వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. వేములపూడి హైస్కూల్లో పరీక్షలు రాసి, తిరిగి వచ్చిన బాలికపై మేనమామ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు సీఐ వెల్లడించారు.

క్లుప్తంగా

ఎంపీ అభ్యర్థి బూడికి అభినందనలు



బూడి ముత్యాలనాయుడికి అభినందనలు తెలుపుతున్న పీడీ గాంధీ, చదరం చిన్నా, పీలా బుజ్జి

తుమ్మపాల: అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని తుమ్మపాల అన్నపూర్ణ బ్యాంకు మాజీ చైర్మన్ పీడీ గాంధీ, వైస్ సర్పంచ్ చదరం చిన్నా, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పీలా బుజ్జి అభినందన సత్కారం చేశారు. మాడుగులలోని బూడి నివాసానికి వెళ్లి దుశ్శాలువాతో సత్కరించి, పార్టీ విజయానికి తమ వంతు కృషి శాయశక్తులా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు బుద్ధ లహరి, కొణతాల శివాజీ, కొణతాల శ్యామ్, మద్దాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం ఉల్లి మినహా మిగిలిన కూరగాయల ధరలు స్థిరంగా ఉన్నాయి. ఉల్లి కిలో ధర గత వారం రూ.25 ఉండగా, ఈ వారం రూ.30కి చేరింది. టమాటా, బంగాళాదుంప ఎప్పటిలాగే రూ.20, క్యాబేజీ రూ.30, వంకాయ, బెండకాయ, దొండకాయ, క్యారెట్, బీట్రూట్, చేమదుంప రూ.40, కాకరకాయ, గోరుచిక్కుడు, బీరకాయ రూ.60, పాదు చిక్కుడు, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

ఆంద్ర మృతి తీరని లోటు

తుమ్మపాల: తెలుగు కవి, ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసి అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆంద్ర నరసింహమూర్తి మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు వై.సత్యం అన్నారు. పట్టణంలోని గాంధీనగరంలో గురువారం నరసింహమూర్తి అకాల మరణం చెందారు. మండలంలోని శంకరం గ్రామంలో జన్మించిన ఆయన ఉపాధ్యాయుడిగా పలు స్కూళ్లలో పనిచేశారు. హెచ్ఎంగా మున్సిపల్ హైస్కూల్, గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో విధులను నిర్వర్తించారు. ఏపీటీఎఫ్ కార్యవర్గం ఆయన నివాసానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడిగా, హెచ్ఎంగా ఆయన చేసిన సేవల్ని కొనియాడారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 3,506 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,760	4,500
మొదటి రకం	3,530	4,070
రెండో రకం	3,450	3,800
మూడోరకం	3,260	3,500

అనకాపల్లి సినిమాలు

ఈగల్ : రాజా
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి) : సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్ : సత్యనారాయణస్క్రీన్-2
ఓం భీం బుష్ : షిర్డిసాయి
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి) : పర్తిసాయి
ది గోట్ లైఫ్ : వెంకటేశ్వర
కలియుగ పట్టణంలో: శ్రీసత్య
టిల్లు స్క్వేర్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 410 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఊరు మారింది

అభివృద్ధిలో.. వి'నూతన'గుంటపాలెం



నా పేరు ముత్తుర్తి మణి. భర్త శ్రీనివాసరావు, బాబు చరణ్, పాప మేఘనతో నూతలగుంటపాలెంలో ఉంటున్నాం. మా గ్రామంలో సచివాలయం ఏర్పాటుతో జరిగిన మేలు చెప్పేందుకు మాటలు చాలవు. గతంలో మా పిల్లలకు క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రం కశింకోటకు వెళ్లి నా భర్త, పిల్లలు ఎన్ని తిప్పలు పడ్డారో నాకింకా గుర్తుంది. సచివాలయం వచ్చాక అన్ని సర్టిఫికెట్లూ ఇంటికే తీసుకొచ్చి వలంటీర్ ఇస్తున్నారు. మాకు అర్హత ఉన్న ప్రతి సంక్షేమ పథకాన్నీ అందించారు. అధికారుల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా చేశారు. నాకు తెలిసి ఇంతకంటే మేలు ఏ ప్రభుత్వమూ చేయలేదు.. **అంటూ మణి ఆనందం వ్యక్తం చేశారు.**



జగనన్న కాలనీలో ముమ్మరంగా గృహ నిర్మాణాలు

గ్రామంలో ప్రధాన అభివృద్ధి

సచివాలయ భవనం	రూ.25 లక్షలు
నాడు-నేడులో స్కూళ్ల అభివృద్ధి	రూ.38 లక్షలు
త్రిపురవానిపాలెం, అచ్యుతాపురంలో సీసీ రోడ్లు	రూ.20 లక్షలు
రైతు భరోసా కేంద్రం నూతన భవనం	రూ.23.90 లక్షలు



నూతలగుంటపాలెంలో నిర్మించిన సచివాలయ భవనం



త్రిపురవానిపాలెంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



నాడు-నేడులో ముస్తాబైన నూతలగుంటపాలెం ప్రాథమిక పాఠశాల

రూ.కోటికి పైగా నిధులతో అభివృద్ధి పనులు
సీసీ రోడ్లు, స్కూళ్లు, ప్రాధాన్యతా భవనాల నిర్మాణం
జగనన్న కాలనీలో 164 మందికి ఇళ్ల స్థలాలు

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం పంచాయతీ నూతనత్వం సంతరించుకుంటోంది. అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. శివారు గ్రామాలు సైతం అభివృద్ధికి నోచుకుని, రూపురేఖలు మార్చుకున్నాయి. ఈ పంచాయతీ పరిధిలో ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్లలో రూ.కోటికి పైగా అభివృద్ధి పనులు జరిగాయంటే అతిశయోక్తి కాదు.

ఐదేళ్లలో అన్ని వసతులు

కశింకోట మండలానికి శివారున, జాతీయ రహదారిని ఆనుకుని నూతలగుంటపాలెం పంచాయతీ ఉంది. సుమారు 1500 మంది జనాభా. త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం దీనికి శివారు గ్రామాలు.

- ఏనుగుతుని పంచాయతీని కలిపి సచివాలయ కేంద్రాన్ని ఇక్కడే ఏర్పాటు చేశారు. రూ.25 లక్షలతో సచివాలయ భవనాన్ని పంచాయతీ కార్యాలయ భవనంపై నిర్మించారు. తుది మెరుగులు దిద్దాల్సి ఉంది.
- ప్రాథమిక పాఠశాలను నాడు- నేడు నిధులు రూ.18 లక్షలు వెచ్చించి పునరుద్ధరించారు. అందంగా రంగులు, బొమ్మలు వేసి తీర్చిదిద్దారు. తరగతి గదులకు పాత్ వేను కూడా ఏర్పాటు చేశారు.
- శివారు గ్రామం అచ్యుతాపురంలో రూ.16 లక్షలతో ప్రాథమిక పాఠశాలను నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేస్తున్నారు.
- రైతు భరోసా కేంద్ర భవనాన్ని రూ.23.90 లక్షలతో నిర్మాణం చేట్టారు. పనులు తుది దశకు చేరుకున్నాయి.
- శివారు గ్రామాలు త్రిపురవానిపాలెం, అచ్యుతాపురంలలో కూడా అభివృద్ధి పనులు జరిగాయి. రూ.20 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్లు నిర్మించారు.

జగనన్న కాలనీలో 164 మందికి ఇళ్లు

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో నూతలగుంటపాలెంతోపాటు ఏనుగుతుని పంచాయతీలకు కలిపి ఇక్కడే భారీ లే అవుట్ వేశారు. జగనన్న కాలనీలో 164 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. వీటిలో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 38 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, గృహప్రవేశాలు చేశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం కూడా జోరుగా సాగుతోంది.

సొంతింటి కల నెరవేరింది



అత్తమామలు, భర్త, ఇద్దరు పిల్లల ఉమ్మడి కుటుంబం మాది. మాకు సొంతిల్లు లేదు. అత్తమామలతో పాటు ఆ ఇరుకు ఇంట్లోనే ఇబ్బందులు పడాల్సి వచ్చేది. గత ప్రభుత్వంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. పట్టించుకున్న పాపానపోలేదు. జగనన్న ప్రభుత్వంలో మా సొంతింటి కల నెరవేరింది. జగనన్న లే అవుట్‌లో స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు సాయం చేశారు. ఆరు మాసాల కిందటే నిర్మాణం పూర్తి చేసుకుని, గృహప్రవేశం చేశాం.

– అగ్రహారపు ఆదిలక్ష్మి, జగనన్న కాలనీ, నూతలగుంటపాలెం

మట్టిరోడ్లతో అవస్థలు



మాది వ్యవసాయ కుటుంబం. నా భర్త సూరిబాబు, పిల్లలతో కలిసి మూడు దశాబ్దాలుగా ఇదే ఊర్లో ఉంటున్నాం. గత ఏడాది వరకు మా ఊరికి మట్టి రోడ్డే గతి. వానాకాలం వచ్చిందంటే మా అవస్థలు అన్నీఇన్నీ కావు. బురదలో అడుగుతీసి అడుగు వేసేందుకు చాలా కష్టపడాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా సిమెంట్ రోడ్లు వేశారు. ఇపుడే సమయంలోనైనా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందుల్లేవు. జగనన్న చేసిన మేలు మర్చిపోలేం.

– కొయ్య అప్పలనరస, త్రిపురవానిపాలెం

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- ఉగ్గినపాలెం గ్రామ సభలో సీఐ రమేష్‌బాబు



ఉగ్గినపాలెంలో గ్రామ సభలో మాట్లాడుతున్న సీఐ ఎం రమేష్‌బాబు

కశింకోట: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన పోలీస్ బందోబస్తు సిద్ధం చేశామని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ ఎం.వినోద్‌బాబా కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహనలో భాగంగా మండలంలోని ఉగ్గినపాలెంలో గురువారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వివరించారు. నిబంధనల్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు తమ ఎన్నికల సభలు, సమావేశాలను నిర్ణీత సమయంలోగా ముగించాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రధానంగా యువత ఎన్నికల వివాదాల్లో జోక్యం చేసుకుని, తమ భవిష్యత్తును చిక్కుల్లో నెట్టుకోరాదని హితవు పలికారు. తహసీల్దార్ ఎల్.మధుసూదన మాట్లాడుతూ ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎంపీడీవో శేషుబాబు, ఎస్ఐ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

తుమ్మపాల: ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, అంకితభావంతో చదివి ఉత్తమ పౌరులుగా సమాజానికి సేవలందించాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాలలో అన్ని వసతులతో విద్యా బోధన అందుతోందన్నారు. మంచి సంస్థలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి రామకృష్ణ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్




చూచుకొండలోని నూకాంబిక అమ్మవారి సన్నిధిలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక: చూచుకొండ గ్రామంలో గురువారం నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు), వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్,డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ,మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్,సర్పంచ్ దొడ్డి సూరప్పారావు,ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్ కుమార్,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

రైళ్ల హాల్టు కోసం ఏడీఆర్ఎంకు వినతి

- రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలించిన ఏడీఆర్ఎం ఎడ్విన్



ఏడీఆర్ఎం ఎడ్విన్‌కు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

యలమంచిలి రూరల్ : స్థానిక రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పించాలని కోరుతూ రైలు ప్రయాణికులు గురువారం రాత్రి దక్షిణ మధ్య రైల్వే అదనపు డీఆర్ఎం(ఇన్‌ఫ్రా) పీఈ ఎడ్విన్‌కు వినతిపత్రం అందజేశారు. రత్నాచల్, విశాఖపట్నం-మహబూబ్‌నగర్, బెంగుళూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు యలమంచిలి రైల్వేస్టేషన్‌లో హాల్టు సౌకర్యం కల్పించాలని ఏడీఆర్ఎంకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఆయన రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి ఇంకా ఏవైనా ఇబ్బందులున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ ప్రయాణికులకు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నిల్చొని ప్రయాణించే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఆయన వెంట డివిజినల్ రైల్వే ఇంజనీర్ రవి, సెక్షన్ ఇంజనీర్ రవి కిషోర్, యలమంచిలి రైల్వే స్టేషన్ ఎస్ఎస్ ఆకుల సురేష్ కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..



నాయీబ్రాహ్మణవీధిలో వృద్ధురాలి కాళ్లకు నమస్కరిస్తున్న భరత్‌కుమార్



కోట్నివీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

- ఇంటింటా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్
- వెన్నంటి నడుస్తున్న పార్టీ శ్రేణులు, నీరాజనాలు పలుకుతున్న ప్రజలు

అనకాపల్లి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ఎన్నికల ప్రచారం జోరుగా, హుషారుగా సాగుతోంది. ఇంటింటికీ వెళ్లి, ప్రతి ఓటరూ కలిసి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. గడప గడపకూ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో వార్డులోని కోట్నివీధిలో భరత్ కుమార్ పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్నివీధి, గొల్లవీధి, నాయీబ్రాహ్మణవీధిల్లో బలహీన వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్నారని, ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా పట్టణంలో ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. గొల్లవీధిలోని యూపీహెచ్‌సీని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు. మనందరి జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఈ ఆస్పత్రికి రూ.కోటీ 50 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించి, వైద్య సిబ్బందిని నియమించి 10 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైల్వే స్టేషన్‌నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు తారురోడ్డు అభివృద్ధి, కోట్నివీధి, గొల్లవీధి, నాయీబ్రాహ్మణవీధిలో సీసీరోడ్లు, వృద్ధులు, చిన్నపిల్లలు, దివ్యాంగులకు వ్యాయామ, ఆట పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు మన రాష్ట్ర అభివృద్ధిని చూసి ఆయా రాష్ట్రాల్లో వాటిని అమలు చేస్తున్నారని, ఆ ఘనత జగన్‌దేనని కొనియాడారు. కరోనా విపత్తు సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన పేదల పక్షపాతి జగన్ అని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకున మరిన్ని సంక్షేమ, అభివృద్ధిని ప్రజలు అందుకునేలా తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అంతకు ముందు మండలంలోని కూండ్రం గ్రామంలో గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు అప్పికొండ మునిస్వామి, గాడి మాధురినాయుడు, సేనాపతి సాయి, వాసు, కోట్ని శ్రీనివాసరావు, కొణతాల సత్తిబాబు, పిసినికాడ సర్పంచ్ యల్లపు రమేష్, స్థానిక నాయకులు వైఎస్ నాయుడు, బొబ్బిలి శ్రీను, సేనాపతి పెంటారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో ఆటో ద్వారా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

కశింకోట: మండలంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా ఆటోలపై మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. కశింకోటతోపాటు మిగిలిన గ్రామాల్లో పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ విజయాన్ని కోరుతూ విస్తృతంగా మైక్ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భరత్‌కుమార్‌ను గెలిపించాల్సిందిగా కోరుతున్నారు.

చింతలపాలెంలో ఇఫ్తార్ విందు

కశింకోట: మండలంలోని చింతలపాలెం మసీదు వద్ద గురువారం రాత్రి ముస్లింలు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం దీక్షల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కొట్టి రాము, మసీదు కమిటీ ప్రతినిధి బాబూరావు, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్, పలువురు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ వాహనాలను నియంత్రించాలి

మునగపాక : పూడిమడక రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించాలని కోరుతూ గురువారం అఖిలపక్షం ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు అందించారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారికి సంబంధించి శాశ్వత పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు రాకుండా చూడాలని అఖిలపక్షం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, మొల్లేటి సత్యనారాయణ, ఎం.కృష్ణ తదితరులు వినతులు అందజేశారు. ఆర్టీవో కార్యాలయంతో పాటు పోలీసు ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా విన్నవించారు. భారీ వాహనాలు రాకపోకల కారణంగా పూడిమడక రోడ్డు దెబ్బతిందన్నారు. ఇకపై సమస్య ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒడిశా మద్యం స్వాధీనం

పరవాడ: మండలంలోని తానాంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు పర్యవేక్షణలో పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. పెందుర్తికి చెందిన సుశాంత్ పాత్రో, కొత్తవలసకు చెందిన లంక గౌరీశంకర్ కలిసి తమ బొలెరో వాహనంలో ఒడిశా జిల్లా బరంపురం నుంచి ఒడిశా మద్యం 146 క్వార్టర్ సీసాలను తీసుకొని వస్తుండగా.. తానాం సమీపంలో పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. దాడిలో లభ్యమైన మద్యం సీసాల విలువ రూ.19,194 ఉంటుందని, మద్యం సీసాలతో సంబంధం ఉన్న ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసి, వాహనాన్ని సీజు చేశామని సీఐ బాలసూర్యారావు తెలిపారు.